


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అతిథి

**ఏదో వాసన** వస్తూండటంతో బెడ్‌రూంలో నిద్రపోతున్న త్రివేణి దుప్పట్లోంచి తల బయటకి తీసి ముక్కు ఎగబీల్చింది. ఎగ్ వాసన. శైలేష్ డ్యూటీకి వెళ్ళలేదా? ఇవాళేదో అర్జంట్ వర్క్ ఉందని చెప్పాడే? ఐనా ఈ టైమ్ కి తినడం అలవాటు లేదు కదా? ఆమెకి అనుమానం వచ్చింది.

నెమ్మదిగా లేచి బయటకి వచ్చింది. వంటగదిలో లైట్ వెలుతుతోంది.

"శైలూ" అనుమానంగా పిలిచింది.

ఓ అరనిమిషం నిశ్శబ్దం తర్వాత వంటగదిలోంచి ఓ యువకుడు అట్లకాడతో బయటకి వచ్చాడు. అదిరిపడిన ఆమె అప్రయత్నంగా చిన్నకేక పెట్టింది. అతను ఒక్క గంతులో ఆమె దగ్గరకి వచ్చి అట్లకాడని గాల్లో ఊపుతూ గుసగుసగా చెప్పాడు

"ష్! నిశ్శబ్దం."

నైట్ లేంప్ వెలుగులో త్రివేణి అతన్ని కళ్ళప్పగించి చూసింది. తర్వాత పెగుల్చుకుని అడిగింది.

"ఎవరు నువ్వు?"

"దొంగని."

"దొంగ?" ఆమె సోఫాలో కూలబడింది.

"ఇంట్లోకి ఎలా వచ్చావు?"

"తలుపు దగ్గరకి వేసి ఉంది. లోపలినించి వెలుగు కనిపిస్తోంది. మెల్లిగా లోపలికి వచ్చి తలుపు లాక్ చేసా" నవ్వాడు.

తర్వాత కటువుగా చెప్పాడు

"మాట్లాడకుండా కూర్చో. నోరెత్తినా, ఎవరికైనా ఫోన్ చేసినా చంపేస్తాను."

త్రివేణి బిక్కచచ్చిపోయి వణుకుతూ తలూపింది.

అతను వంటగదిలోకి పరిగెత్తి ప్లేట్‌లో ఆమ్లెట్‌తో వచ్చాడు.

ఆమె ఎదురుగా కూర్చుని తింటూ గద్దించాడు.

"ఇంట్లో ఉల్లిపాయలు రెండే ఉన్నాయని చూసుకోవద్దూ? ఆడంబరాలు, డెకొరేషన్స్ కాదు. ఇంట్లో పాలు, పెరుగు, కూరగాయలు అన్ని సమృద్ధిగా ఉండాలి"

త్రివేణిలోని ఇల్లాలు ఆ మాటలకి కొంచెం సిగ్గుపడింది. కళ్ళెత్తి అతనివంక చూసింది. సామాన్యంగా ఉన్నాడు. రోజూ రోడ్లమీద అలాంటివాళ్ళు ఎంతమందో కనిపిస్తారు. ఏ ప్రత్యేకత లేకుండా.

"నువ్వు నిజంగా దొంగవా? " అడిగింది.

"ముఖ్యమంత్రినంటే నమ్మలేం కాని నాకు నేను దొంగనని చెప్తున్నా కదా? మీ ఇంటికి నాలుగిళ్ళ అవతల ఇంట్లోకి వెళ్ళా. కొత్తగా పెళ్ళయినవాళ్ళనుకుంటా. బెడ్రూము తలుపేసుకుని వెచ్చగా వాటేసుకుని పడుకుని ఉన్నారు. నాకు ఇబ్బంది లేకుండా డైమండ్ ఉంగరం, రోలెక్స్ వాచీ కనిపించాయ్. ఈరోజుకి చాలని బయటకి వచ్చి మీ ఇంటిమీదుగా వెళ్తూంటే తలుపు ఓరగా వేసి కనిపించింది. దొంగబుద్ధి కదా! దూరేసా" నవ్వాడు.

ఆమెకి భర్తమీద కోపం ఉవ్వెత్తున లేచింది. డ్యూటీకి వెళ్తూ తలుపు సరిగ్గా వేయాలని కూడా ఎవరు చెప్పాలి? అప్పటికీ తను లక్షసార్లు చెప్పింది డోర్ లాగి వెళ్ళడం కూడా చేయకపోతే ఎలా? ఎప్పుడో ఏ దొంగాడో కొంపలోకి వచ్చి నా పీక నొక్కి వెళ్తాడు అని. మనిషికి అంత నిర్లక్ష్యం ఏమిటి? వీడి మొహంకూడా చూసింది. ఐడెంటిఫై చేస్తుందని చంపిపోతాడేమో!

వణుకుతూ అతనివైపు చూసింది

"మీ అయనేం చేస్తాడు? ఇంట్లో లేడే?" అడిగాడు.

"తనకి నైట్ డ్యూటీలు ఎక్కువ. ఏర్‌పోర్ట్‌లో పనిచేస్తాడు కస్టమ్స్ లో" నెమ్మదిగా చెప్పింది.

దొంగ చిన్నగా ఈల వేసాడు. డైనింగ్ టేబుల్‌మీద బౌల్‌లో ఉన్న ఏపిల్ అందుకుని కొరికి కసకసా తింటూ చెప్పాడు.

" మంచి జాబే."

"అయ్యో! కదుక్కోలేదు" త్రివేణి అప్రయత్నంగా చెప్పింది.

అతను పకపక నవ్వి చెప్పాడు.

"అలా శుభ్రంగా ఉంటేనే మాకు రోగాలొస్తాయ్"

త్రివేణి మాట్లాడలేదు.

"నీ పేరేంటి?" అడిగాడు.

"త్రివేణి"

మళ్ళీ కిసుక్కున నవ్వాడు.

"అదేంటి వక్కపొడిపేరు?"

"వక్కపొడికే ఆ పేరు పెట్టారు. మా స్కూల్లో నన్ను అలాగే ఏడిపించేవారు" చెప్పింది.

"మీ నాన్న అసలు నీకు ఆపేరెందుకు పెట్టాడు?"

"మా నాయనమ్మ పేరు త్రిపురసుందరి. ఆపేరే పెట్టాలని పంతం పట్టింది. మా మామయ్య, మా అమ్మ తమ్ముడు నాన్నకి చెప్పాడు.

"ఆవిడ బడికి వెళ్ళలేదు కాబట్టి సరిపోయింది బావా, ఇది స్కూల్‌కి వెళ్తే తిప్పు, సుందరి అని ఎగతాళి చేయరు?" మా నాన్న కన్విన్స్ అయి మొదటి అక్షరం మాత్రం తీసుకుని త్రివేణి అని పెట్టారు. నాయనమ్మ చచ్చేదాకా సాధిస్తూనే ఉంది" త్రివేణి చెప్పింది. తర్వాత అనుకుంది వీడితో కబుర్లేమిటి?

దొంగ కావల్సినవి తీసుకెళ్తే నిద్రపోవచ్చుగా? వీడు పోడా? గొణుగుతున్నట్లుగా చెప్పింది.

"నువ్వు వెళ్ళచ్చుగా! పడుకుంటా."

దొంగ లేచి కిటికీ దగ్గరకి వెళ్ళి, కర్టెన్ తొలగించి చూసాడు. తర్వాత వచ్చి యధాస్థానంలో కూర్చుని చెప్పాడు. "జనాలు తిరుగుతున్నారు. ఇంకో గంటలో అంతా సద్దుమణుగుతుంది. వెళ్ళిపోతా."

త్రివేణి కొంచెం తేలికపడింది.

"నువ్వు కూడా పనిచేస్తున్నావా?" అడిగాడు.

"ఆ రైల్వేస్‌లో" చెప్పింది.

దొంగ ఫక్కున నవ్వాడు.

"ఒకరు విమానం, ఇంకొకరు రైలు. మంచి ఉద్యోగాలే. పిల్లలున్నారా?"

"ఇద్దరు. ఊటీలో చదువుకుంటున్నారు."

"అంతేగా మరి. ఇద్దరూ ఉద్యోగాలేనయ్యే" ఒక నిమిషం ఆగి అడిగాడు.

"నీకు అమ్మా నాన్నా లేరూ?"

"ఉన్నారు, మాకు దగ్గర్లోనే ఉంటారు"

"వాళ్ళు చూసుకోరూ పిల్లల్ని?"

"నాకిష్టంలేదు" త్రివేణి తల అడ్డంగా తిప్పింది.

త్రివేణికి దుఃఖం వచ్చింది. ఒక్కతే కూతురు. తన దగ్గిర ఉండాలని అమ్మా నాన్నలకి ఎంతుందో తెలిసి కూడా వాళ్ళని దూరం పెట్టింది. శైలేష్‌కి కోపం వస్తే కంట్రోల్‌లో ఉండడు. చుట్టుపక్కల ఎవరున్నారో గమనించకుండా అరుస్తాడు. అప్పుడప్పుడూ బూతులు తిడతాడు. తల్లితండ్రులు అవి వినడం, ఆ పరిస్థితిని ఎదుర్కోవడం త్రివేణికి ఇష్టంలేదు. ఆ అవమానాన్ని దిగమింగడం ఆమెకి సాధ్యంకాదు .వాళ్ళు ఉండడం శైలేష్‌కీ ఇష్టంలేదు.

"మీ ఆయనతో సమస్యా?" ఆమె ముఖకవళికలు గమనించి అడిగాడు.

తలూపబోయి ఆగి అడిగింది.

"నువ్వు దొంగవి. నీతో నా పర్సనల్ విషయాలు ఎందుకు చెప్పాలి?"

అతను కొద్దిగా చిన్న బుచ్చుకుని చెప్పాడు.

"దొంగ కంటే ముందు మనిషినేగా? నిన్ను బ్లాక్ మెయిల్ చేసేవైతే చెప్పద్దులే."

త్రివేణి సోఫాలో ముడుచుకుని కూర్చుంది. ఆమెకి ఈ పీడకలలోంచి ఎప్పుడు మెలుకువ వస్తోందా అనిపిస్తోంది.

అతను లేచి సోఫాలో ఉన్న త్రో తీసి ఆమె భుజాల చుట్టూ కప్పి అడిగాడు.

"పోనీ పిల్లల్ని దగ్గర్లో చేర్పించాల్సింది. మరీ ఊటీలో ఏంటి?"

"శైలేష్ మూడుసార్లు సివిల్స్ ట్రై చేసినా ఐ ఎ ఎస్ కాని, ఐ పి ఎస్ కాని రాలేదు. పిల్లల వల్లయినా ఆ కోరిక తీర్చుకోవాలని."

"శైలేష్? ఓ మీ ఆయనా? నువ్వేం చదివావు?"

"ఇంజనీరింగ్. స్పోర్ట్స్ కోటాలో రైల్వేస్‌లో జాబ్ వచ్చింది."

"అవునా? భలే. ఏ ఆట ఆడతావు?" ఆసక్తిగా అడిగాడు

"బాస్కెట్ బాల్. అన్నీ ఇష్టమేకాని, పొడుగ్గా ఉంటానని పిటి సార్ బాస్కెట్ బాల్‌లో జాయిన్ చేసారు. డిస్ట్రిక్ట్ లెవల్లో ఆడాను. స్టేట్ లెవెల్ ఆడడానికి హైద్రాబాద్ పంపించడానికి మా నాయనమ్మ ఒప్పుకోలేదు."

"త్రిపుర సుందరమ్మ? భలే పేచీకోరు మనిషల్లే ఉందే"

"అప్పుడు మా మామయ్య మళ్ళీ వచ్చి 'పంపించుబావా. స్పోర్ట్స్ కోటాలో మంచి కాలేజ్‌లో సీట్లు, మంచి ఉద్యోగాలు వస్తాయి. అవకాశం ఉన్నప్పుడు ఉపయోగించుకోవాలని నాన్నకి నచ్చ చెప్పాడు. మామయ్య అన్నట్లే నా తెలివి తేటలకి నేనీ జాబ్ చేస్తున్నాను" చెప్పింది.

"విష్ణుమూర్తి చక్రం అడ్డేసినట్టు సమయానికి వస్తాడే మీ మావ" దొంగ నవ్వాడు.

త్రివేణి కూడా చిన్నగా నవ్వింది.

"ఈ పెళ్ళి సంబంధం కూడా నీ జాబ్‌ని చూసే వచ్చిందేమో?" అనుమానంగా అడిగాడు.

"నిజమే అందుకే ఒప్పుకున్నారు."

"అడక్కూడదు కాని అడుగుతున్నా. నువ్వెవర్నీ ప్రేమించలా?"

త్రివేణి తల అడ్డంగా ఊపింది. నూనె రాసిన జుట్టుని పక్క పాపిడి దువ్వి, ఇస్త్రీలేని శుభ్రమైన బట్టలు ధరించే అబ్బాయి కళ్లముందు కదలాడాడు .ఆరాధనాపూర్వకమైన అతని చూపులు ఇప్పటికీ మర్చిపోలేదు తను. తనని దేవతలా ఆరధించే అతన్ని వదులుకుని బూతులు తిట్టే ఈ ఆఫీసర్ని చేసుకుంది. అవును. అన్ని సంబంధాలు ఆర్ధిక సంబంధాలే!

"మీ పిల్లలకి ఏవైనా ఆటలు నేర్పిస్తున్నారా?" దొంగ అడిగాడు.

"లేదు. వాళ్ళకి ఇష్టమే కాని శైలేష్ ఒప్పుకోలేదు. ఎక్కువగా చదువు మీదే కాన్సన్‌ట్రేషన్."

దొంగ చప్పరించాడు.

"ఎప్పుడో మీ నాన్న ఆడపిల్లని కూడా చూడకుండా నిన్ను ఛాంపియన్‌ని చేస్తే, నువ్వేంటీ నీ పిల్లలకి ఇష్టమైన ఆటల్లో చేర్చలేదు?"

"ఏ ఇంట్లోనైనా మగాళ్ళదే పెత్తనం. నాన్నకి ఇష్టం కాబట్టి చేర్పించారు. అమ్మకి ఇష్టమైతే? ఇక్కడ నా గతీ అంతే" త్రివేణి ఉక్రోషంగా చెప్పింది.

దొంగ అనంగీకారంగా చెప్పాడు.

"తప్పు, మీ అమ్మ జనరేషన్ వేరు. నీది వేరు. నువ్వు నెలకి ఏభైవేలపైన సంపాదిస్తున్నావు."

"లక్షా అరవై" త్రివేణి అడ్డొచ్చింది.

దొంగ కళ్ళప్పగించి విభ్రాంతిగా చూసాడు.

"ఐతే తప్పంతా నీదే. పిల్లల్ని వాళ్ళకి ఇష్టమైనట్లు పెంచలేవు. పేరెంట్స్‌ని నీతో ఉంచుకోలేవు. నీకంత సంపాదన వేస్ట్. మా నాగేశ్వరరావు పెళ్ళాంకి ఏ బి సి డిలు కూడా రావు. రూపాయి సంపాదన లేదు. ఇంట్లో దాందే పెత్తనం. వాడు కానీ అది గీసిన గీత దాటాడా? చచ్చాడే. దానికున్న ధైర్యం నీకెందుకు లేదు?"

"అది గయ్యాళితనం. సంస్కారం లేకుండా అలా ప్రవర్తించడం నాకు రాదు" త్రివేణి అసహనంగా చెప్పింది.

దొంగ పకపక నవ్వాడు.

"అది గయ్యాళితనం కాదు. నీది ఫాల్స్ ప్రెస్టేజ్. సొసైటీలో మచ్చలేకుండా కనిపించాలని. రెండుసార్లు ఎదురుతిరిగితే, మూడోసారి శైలేషే దారిలోకి వస్తాడు. వినకపోతే విడిచిపెట్టెయ్. అహ.. చెప్పు విడిచిపెడ్తానని. హాయిగా అమ్మా నాన్నలు, పిల్లలుతో బతుకుతానని చెప్పు. చచ్చినట్లు ఒప్పుకుంటాడు. అసలు ముందు రేపు రాగానే తిట్టు. తలుపు మూయడం కూడా రానివాడికి ఇంత అహంకారమెందుకని అడుగు."

దొంగలేచి కిటికీలోంచి చూసి చెప్పాడు.

"సరే. వెళ్తున్నా. ధైర్యంగా బతుకు. సరేనా? మీ ఆయన గొలుసో, ఉంగరమో ఉంటే ఇవ్వు. ఒట్టి చేతుల్తో పోలేను."

త్రివేణి మౌనంగా లేచి అల్మైరాలోని శైలేష్ బ్రేస్‌లెట్ తెచ్చిచ్చింది.

దొంగ దాన్ని గాల్లోకి ఎగరేసి పట్టుకుని జేబులో వేసుకుని చెప్పాడు "ఇంట్లో ఉప్పు, పప్పులు, కూరగాయలు ఉన్నాయో లేదో చూసుకో. డబ్బు కడుపు నింపదు. అది కోడిగా మారాకే పొట్టనింపుతుంది" సెకన్లలో అతను తలుపు తీసుకుని వేగంగా బయటకి వెళ్ళిపోయాడు.

త్రివేణి ఓ నిమిషం ఆ హాల్‌లో అలా కూర్చుండిపోయింది. తర్వాత లేచి తలుపు మూసి బోల్ట్ పెట్టి బెడ్‌రూంలోకి వెళ్ళింది. మంచం మీద పడుకుని దుప్పటి కప్పుకుంది.

జరిగిన సంఘటన గురించి ఆలోచిస్తుంటే ఆమెకి ఆశ్చర్యం వేసింది. ఎందుకు ఈ మార్గం ఎంచుకున్నాడోకాని ఈ దొంగ మంచి తెలివితేటలు కలవాడు. తన కాపురం గురించి ఐదు నిమిషాల్లో తెలుసుకున్నాడు. మరి తన పెళ్ళయి పదిహేడు ఏళ్ళవుతోంది. తల్లితండ్రులు తెలుసుకోలేరా?

ఆమెకి సిగ్గనిపించింది. తను మంచి కూతురు కాదు. మంచి తల్లి కాదు. 'మంచి భార్యని కాద'ని శైలేష్ తరచూ అంటూంటాడు. తనేం సాధించింది మరి?

పెళ్ళయిన కొత్తల్లో ఎంత ఉత్సాహంగా ఉండేది? శైలేష్‌ని అంటిపెట్టుకుని ఉండేది. గ్రోసరీ షాపింగ్, వాటిని కట్ చేసి సీసాల్లో పోసి షెల్ఫుల్లో సర్దడం, పాలు తోడు పెట్టడం అన్నీ ఇష్టంగా, సరదాగా చేసింది. సూర్యుడి మీద ప్రేమ ఉన్నా ఆ తీక్షణతని ఓ నిమిషం మించి భరించలేం. అలాగే మండే సూర్యుడులాంటి శైలేష్ నించి క్రమంగా దూరమైపోయింది. ఇంటి విషయాల మీద శ్రద్ధ తగ్గింది. నిర్లిప్తత అనచ్చేమో. మొదటి దెబ్బ 'నాన్న రిటైర్ అయ్యారు, అమ్మా నాన్నలని మనతోనే ఉండమందాం అంటే శైలేష్ ఒప్పుకోకపోవడం. పసిపిల్లలని తీసుకెళ్ళి ఊటీలో చేర్చడం రెండో దెబ్బ. దాంతో ఇంటికి పూర్తిగా డిటాచ్ అయిపోయింది.

'ఉల్లిపాయలు లేవని చూసుకోవద్దా?' అని దొంగ తిట్టాడంటే, తను ఇల్లాలిగా కూడా ఓడిపోయింది. అ ఆ ఇ ఈలు రానివాళ్ళు కూడా భర్తలని కంట్రోల్ చేస్తున్నారంటే చిత్రంగా ఉంటుంది. దొంగ అన్నట్లు తనకి సమాజం అంటే భయం.

దొంగతో మాట్లాడినప్పుడు తిరగబడాలి అనిపించినా అలా చేయలేదు. కాకపోతే ఇంటిమీద, పేరెంట్స్ మీద, పిల్లల మీద శ్రద్ధ తీసుకోవాలి. తలుపు తాళం పెట్టడం రానివాడు ఐదుగురి జీవితాలని కంట్రోల్ చేస్తున్నాడు. మరి తను ఎందుకు తన పరిధిలో చక్కదిద్దుకోలేదు? అమ్మావాళ్ళు ఇక్కడ ఉండకపోతే తను రెండు రోజులకోసారి వెళ్ళి వాళ్ళని చూడచ్చుగా? కుదిరినప్పుడు ఊటీ వెళ్ళి పిల్లలతో గడిపి, వాళ్ళ కిష్టమైన క్రీడల్లో ప్రోత్సహించచ్చుగా?

శైలేష్‌తో కూడా ఎడమొహం పెడమొహంకాక అనుకూలంగా ఉండచ్చుకదా? అతని లోపం కోపం అయినప్పుడు కోపం రాకుండా చూసుకోవచ్చుగా?

త్రివేణి దుప్పటి పక్కన పడేసి లేచి ఫోన్‌తో వంటగదిలోకి వెళ్ళి, గ్రోసరీ లిస్ట్‌ని నోట్స్‌లో రాసుకుంది. పాడైపోయి, డేట్ దాటిపోయిన వాటిని డస్ట్‌బిన్‌లో పడేసింది. కూరగాయల లిస్ట్ కూడా రాసుకుంది.

రేపు శైలేష్ డ్యూటీ నించి వచ్చే టైంకి ఏం చేయచ్చు? అని వంటగదిని పరిశీలించింది.

ఆమెకి ఆ ఇల్లాలి పాత్ర చాలా నచ్చింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments